సజ్జ రైతును దళారీ దోపిడీ..!

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- విధి లేక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ధరలు దిగ్గోసి రైతులను దోచుకుంటున్న దళారులు
- గత ప్రభుత్వంలో సజ్జ రైతులకు గిట్టుబాటు ధర


మద్దిపూడిలో రైతు ఇళ్లలో సజ్జ నిల్వలు


కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయక పోవడంతో దళారులకు అమ్ముకున్న సజ్జలు.

మద్దిపూడి: ఆరుగాలం కష్టించి పంట సాగు చేసిన రైతులను దళారులను దోచుకుంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తే అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా కూటమి రైతులను గాలికొదిలేశారు. ఫలితంగా పండించిన పంటకను ఏం చేయాలో తెలియక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని దళారులు ధరలు దిగ్గోసి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. దీంతో రైతులు ఎంతో నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలేవి..?

నియోజకవర్గంలోని సింగరాయకొండ, కొండపి, మద్దిపూడి, పొన్నలూరు, టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం సజ్జ పంట సుమారు 3,800 ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం సజ్జకు క్వింటా రూ.2,650 లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కానీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండల స్థాయిలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులకు లాభాలు దక్కాయి. కానీ కూటమి ప్రభుత్వంలో ఆ ఊసే ఎత్తడంలేదు. ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అధికారులు కూడా ఎప్పుడు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో చెప్పడం లేదు. దీంతో రైతులను దళారులను ఆశ్రయిస్తున్నారు.

ధరలు దిగ్గోసి..

కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు కొన్ని రోజులు ఇళ్లలో స్టాక్ పెట్టుకున్నారు. కానీ తెచ్చిన అప్పులు పేరుకుపోవడంతో విధి లేని పరిస్థితుల్లో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు కూడా కొనుగోలు కేంద్రాలు లేవన్న ధీమాతో ధరలు దిగ్గోశారు. క్వింటా రూ.1900 నుంచి రూ.2 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతుకు క్వింటాకు రూ.,650 నష్టం వాటిల్లుతోంది. ఈ ధరకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. కొంత మంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్న ఆశతో ఇళ్లలో స్టాక్ పెట్టుకున్నారు. అయితే ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో పంట ఎక్కడ తడిసిపోతుందా అని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి:



గత ప్రభుత్వంలో రైతులు పండించిన సజ్జ పంట మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించారు. ఈ ఏడాది రైతులకు పండించిన సజ్జలు కొనుగోలు చేయక ఇంట్లో స్టాక్ పెట్టుకున్నాం. 20 ఎకరాల్లో సజ్జ సాగుచేశా. ఇంత వరకు పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

పెద్దిరెడ్డి, రైతు, మద్దిపూడి

ప్రభుత్వం అనుమతి ఇస్తే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తాం:

మండల స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. అనుమతి వస్తే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తాం

సీహెచ్ వెంకటేష్, వ్యవసాయాధికారి

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి


కనిగిరి: పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు

కనిగిరి రూరల్: రైతులు పంటల సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులను, లాభాలు పొందాలని ఏఓ పీ జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని గుడిపాడు, తాళ్లూరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పొలాలను పరిశీలించి, అనంతరం జరిగిన గ్రామ సభలో ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం కంది పైరుకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎండు తెగులు నివారణకు గ్రాము కార్బండిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏఎంసీ సిబ్బంది జి.లక్ష్మీ, వ్యవసాయ సహాయకులు జీవీ సుబ్బారావు, ఎంపీఈఓ యోగేశ్వరీ, పశువర్ధక సహాయకులు ఎం కృష్ణా కిరీటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): కంది, వరి పంటలను ఆశించే తెగుళ్లపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ ఈవీ రమణ పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిగారి పల్లె, వెంగనగుంట గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ రెడ్డిగారిపల్లెలో కందిపైరును పరిశీలించి కందిని ఆశించే ఎండు తెగులు, వెర్రి తెగులు అదేవిధంగా మినుము సాగులో విత్తనశుద్ధి, కలుపు నివారణ చర్యలు వివరించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏ యం.వెంకటరెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పీసీపల్లి: రాయితీపై శనగలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌కే షారుక్ అన్నారు. మండల పరిధిలోని పెదఈర్లపాడు, వెంగళాయి పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. పండ్ల తోటలను హెచ్ఓ కుసుమ పరిశీలించారు. ఏఈఓ పుల్లయ్య, రామ్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు విధిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని ఎం. నిడమానూరు, పొందూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ముఖ్య అతిథితహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ వెంకట్రావు శనగ, పొగాకు పంటలలో తొలిదశలో ఆశించే పురుగులు నివారణకు దశపర్ని కషాయం ఉపయోగించి నివారించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ సహాయకులు కవిత, పాల్గొన్నారు.

మద్దిపూడి: డీపై శనగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను ముందుగా రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ సూచించారు. మండలంలోని కెల్లంపల్లి, గోసుకొండ అగ్రహారం గ్రామాల్లో మంగళవారం పొలంబడి పిలుస్తుంది నిర్వహించారు. పశుసంవర్ధక శాఖాధికారి కృష్ణా, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరామిరెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు: పంట మార్పిడి పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని సింగరాకొండ సహాయ వ్యవసాయ సంచాలకుడు నిర్మలకుమారి అన్నారు. పొన్నలూరులో మంగళవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సాగుచేసే విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను నివారించవచ్చన్నారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేసి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించాలన్నారు. ఏఓ పూర్ణచంద్రరావు, ఎంపీఈఓలు దివాకర్, సబీహా, రైతులు పాల్గొన్నారు.

కొండపి: రైతులకు అండగా ఉండేందుకే పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి డి.వి జయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం, చోడవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు శనగ విత్తనాలను 25 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. శనగలో వేరుకుళ్లు తెగులు, పుచ్చ పురుగు నివారణకు సూచనలు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదినారాయణ, శ్రీకాంత్ పశుసంవర్ధక సహాయకులు, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్


పీసీపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ

పొన్నలూరు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై ఇంటింటి ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సుజాత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, అధికారులకు గ్రామాల్లో చేపట్టాల్సిన ఆరోగ్య, పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి మురుగు కాలువల్లో పూడిక మట్టిని తీయించి, బ్లీచింగ్ చల్లించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్, ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ఇందిరా కాలనీలో పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. ఇళ్లల్లో నుంచి వచ్చి చెత్త చెదారం, వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో వేయకుండా మున్సిపల్ కార్మికులకు అందజేయాలని, లేదా మున్సిపల్ చెత్త రిక్షాలో వేయాలని సూచించారు. వర్షం నీరు నిల్వ వల్ల దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతాయని తెలిపారు. నివాసాల్లో నీరు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. శానిటరీ సెక్రటరీ రహంతుల్లా, పి.అరుణోదర్, డాక్టర్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేసి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అవగాహన కల్పించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా, మంచినీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈఓ సంజీవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు, మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండపి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బి.రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయించాలని సూచించారు. ఏవో రామకృష్ణ, ఈఓపీఆర్డీ అంజలీదేవి, వైద్యాధికారి అనూష, ఎంఈఓలు సురేఖ, రామారావు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యశాఖ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు ఇవ్వండి

కనిగిరి రూరల్: రైతులకు సకాలంలో విత్తనాలు అందచేయాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన జెడ్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్ పనిముట్లు ఇవ్వాలని, ఎరువులను సచివాలయాల ద్వారా సరఫరా చేయాలని, సకాలంలో రైతులకు అందజేసి ఆదుకోవాలని మంత్రిని, జిల్లా అధికారులను కోరినట్లు చెప్పారు.

పరిమితి మేరకే ప్రయాణికులను ఎక్కించుకోవాలి


టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

టంగుటూరు: ఆటోలో ప్రయాణికులను పరిమితి మేరకే ఎక్కించుకోవాలని, లేకుంటే చట్టపర చర్యలు తీసుకుంటామని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య హెచ్చరించారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సరైన ధ్రువపత్రాలు లేని 20 మంది వాహనదారులకు జరిమానా విధించారు.

మోట ఆంజనేయులుకు నివాళి


ఆంజనేయులు కుటుంబసభ్యులతో నివాళులర్పిస్తున్న ఎస్సై

కొండపి: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని పెరిదేపిలోని మోట ఆంజనేయుని విగ్రహానికి ఎస్సై ప్రేమ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయులు ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఏఎస్‌ఐ అంకారావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల హాస్టల్‌లో మెరుగైన వసతులతో పాటు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కల్పించాలని ఎంపీపీ గాయం సావిత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఒంగోలులో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఈ మేరకు కలెక్టర్‌ను కలిశారు.

కౌలు రైతులను పంట రుణాలివ్వాలి

టంగుటూరు: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం కార్యదర్శి బాలకోటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కొణిజేడు సచివాలయంలో కౌలు రైతులు, సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి సౌమ్యకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల నాయకులు వేసుపోగు మోజేసు, షేక్ మీరాస్, మక్కెన శ్రీనివాసరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- ఆర్టీసీ డీఎం మహమ్మద్ సాయనా బేగం


మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం మహ్మద్ సాయనా బేగం

కనిగిరి రూరల్: ప్రయాణికులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించి.. కనిగిరి డిపో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపడతానని కనిగిరి ఆర్టీసీ డిపో డీఎం మహ్మద్ సయాన బేగం అన్నారు. ఒంగోలు డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ.. కనిగిరి డిపోకు ఎఫ్ఏసీ (ఇన్‌చార్జి) డీఎంగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో డీఎం సాయనా బేగం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కనిగిరి డిపోలో 107 బస్సులు ఉన్నట్లు తెలిపారు. అందులో 20 హైయ్యర్ బస్సులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి రోజు కనిగిరి డిపో నుంచి 45 బస్సులు, 66 సర్వీసులను కనిగిరి టు విజయవాడకు నడుపుతున్నట్లు వెల్లడించారు. కనిగిరి డిపోకు త్వరలో కొత్తగా 33 కొత్త బస్సులు రానున్నట్లు వెల్లడించారు. డిపో నుంచి ప్రతి రోజు 47 వేల కిలోమీటర్లు బస్సులు తిరగాల్సి ఉండగా.. అదనంగా మరో వెయ్యి కిలో మీటర్లు తిరుగుతున్నట్లు చెప్పారు. దసరా పండుగ సీజన్‌కు వారం రోజుల పాటు డిపో నుంచి నడిపిన ప్రత్యేక బస్సులకు రూ.27 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థ కార్మికుల భద్రత, సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. డిపోలో ప్రయాణికులకు కావాల్సి మౌలిక వసతులు, తక్షణ సౌకర్యాలపై ఇప్పటికే కొన్నింటిని గుర్తించామని.. పూర్తిగా స్థాయి పరిశీలించి డిపోలో ప్రయాణికులకు అన్ని మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కార్తీక మాసం సందర్భంగా ప్రయాణికుల, భక్తుల సౌకర్యార్థం పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి కనిగిరి డిపో నుంచి పంచరామాలు అమరావతి, పాలకొల్లు, భీమావరం, ద్రాక్షారామం, సామర్లకోటకు ప్రతి ఆదివారం రాత్రి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తామని, ఆ బస్సులు తిరిగి మంగళవారం ఉదయం 11 గంటలకు కనిగిరికి చేరుతాయని వెల్లడించారు. టిక్కెట్‌కు రూ.2 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చన్నారు. అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, టిక్కెట్‌కు రూ.2,200 చెల్లించి బుక్ చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు 36 నుంచి 40 మంది ఉంటే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సౌకార్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం


పోస్కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా

కొండపి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ పోస్టుకార్డు ఉద్యమాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్ నేతృత్వంలో మండల అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ఏ హామీలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు నెరవేర్చలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి తమ చిత్తశుద్ధిని నిలుపుకోవాలన్నారు. మహిళలంతా పోస్టుకార్డు ద్వారా ఉత్తరాలు రాసి ముఖ్యమంత్రికి పంపాలన్నారు. అనంతరం మహిళలతో కలిసి కొంతదూరం బస్సులో ప్రయాణించారు. నాయకులు బొడ్డు సతీష్, పురుషోత్తం కోటేశ్వరరావు పఠాన్ సాజిద్ ఖాన్ మరియు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి


మాట్లాడుతూ డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి

కనిగిరి రూరల్: సీజనల్ వ్యాధులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో వచ్చే మార్పులతో ప్రబలే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య, ఆరోగ్య, నీటి తదితర శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండి, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కలుషితం వల్ల డయేరియా వంటి వ్యాధుల వచ్చే ప్రమాదం ఉందన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వారి పరిధిలోని గ్రామాల్లో ప్రతిరోజు ఖచ్చితంగా ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. జ్వరాలు ప్రబలితే తక్షణం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎంపీడీఓ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు దాదా షరీఫ్, ఫణి, ప్రియార్షానంద, శ్రీకాంత్, ఎంఈఓ యుపీ నారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, హైమావతి, విజయభాస్కర్‌రావు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు, సీహెచ్ఓ నాగముణమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి


కలికవాయి గ్రామసభలో పాల్గొన్న తహశీల్దార్ రవి


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

కొండపి: భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.మురళి అన్నారు. మండలంలోని జీడీ కండ్రికలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో భూములకు సంబంధించి జరిగిన రీ సర్వేలో సమస్యలను ఎదుర్కొన్న పలువురు రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు సమర్పించారన్నారు. అర్జీలలో ప్రధానంగా విస్తీర్ణంలో తేడాలు, యాజమాన్య హక్కులు నమోదు కాకపోవడం, జాయింట్ పట్టాలు వంటి వాటి మీద ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. మండల సర్వేయర్ ఫయాజ్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కాశయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వీఆర్వోలు మాధవి, రామాంజనేయులు, గ్రామ సర్వేయర్ గాలయ్య, రైతులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని కనుమళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు రీ సర్వేపై గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలో రీ సర్వేపై జరిగిన తప్పులను సరిచేస్తామన్నారు. రైతులు గ్రామసభల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

పీసీపల్లి: మండల పరిధిలో రీ సర్వే జరుగుతున్న ఏడు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ నెల 23 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 23న పిచ్చిగుంటపల్లి, 24న గోసిగుండాలు, 26న చోట గోగులపల్లి, 29న పెదవరి మడుగు, 5,6న ముద్దపాడు, మద్రికుంటపల్లి, 8న తలకొండపాడు, 12న మారెళ్ల గ్రామాల్లో సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

రీ సర్వే సమస్యలు పరిష్కరిస్తాం

సింగరాయకొండ: భూముల రీసర్వేకు సంబంధించిన సమస్యలను దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ టి.రవి అన్నారు. మండలంలోని కలికవాయ గ్రామంలో మంగళవారం భూముల రీ సర్వే పై గ్రామసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలో 38 అర్జీలు వచ్చాయన్నారు. సర్పంచ్ చిడిపూడి వెంకటరత్నం, ఎంపీటీసీ ఉల్చి అరుణ, సర్వేయర్ బ్రహ్మం, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

టంగుటూరు: రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని పొందూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల సర్వేయర్ నందయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టల్స్ తనిఖీ

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ వసతి గృహాలను కందుకూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ నిఖిల్‌రెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కాలేజీ బాలికల, బాలుర వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, మెనూను పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని, కూరలను ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, వార్డెన్లు, పాల్గొన్నారు.


బాలికల వసతి గృహంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జడ్జి

రోల్ తక్కువ నెపంతో పాఠశాలలను మూసేయొద్దు

సీఎస్‌పురం(పామూరు): రోల్ తక్కువగా ఉందనే నెపంతో బోయమడుగుల పాఠశాలను మూసివేయాలనే ఆలోచన విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్.ఆనంద్‌బాబు పేర్కొన్నారు. స్థానిక మెయిన్‌స్కూల్‌లో మంగళవారం సాయంత్రం ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈసంధ్బంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా సెలవుజీతాలు ఆలస్యమవుతున్నాయని, దానివల్ల కొంతమందికి ఈనెలలో ఇప్పటికీ కూడా జీతాలు రాలేదన్నారు. బిల్లులు ఆలస్యం కాకుండా చూడాలని వారు డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పీఎఫ్, ఏపిజీఎల్ఐ బిల్లులు సకాలంలో చెల్లించాలని, 12వ పీఆర్‌సీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు చెన్నయ్య, రామకృష్ణ, సుబ్బరాయుడు, హమద్, చిన్న నారాయణ, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన విద్యా ప్రవేశ్


విద్యార్థులతో ఎంఈఓ యుపీ నారాయణరెడ్డి

కనిగిరి రూరల్: మండలంలోని కొత్త ఏరువారిపల్లిలో ఒకటో తరగతి విద్యార్థులకు 90 రోజులుగా నిర్వహించిన విద్యా ప్రవేశ్ కార్యక్రమ ముగింపు మూల్యాంకనం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ ఢిల్లీ నుంచి వచ్చిన అసోసియేట్ ప్రొఫెసర్ రష్మీ, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు సృజన, శ్రీలత, మండల విద్యాశాఖ అధికారి యుపీ నారాయణరెడ్డి, హెచ్ఎం వెంకటరెడ్డి ఉపాధ్యాయురాలు సరళాదేవి పాల్గొన్నారు. ఎంపీపీఎస్ చింతలపాలెం హెచ్‌పీ, ఎంపీయూపీఎస్ మాచవరంలలో కూడా విద్యా ప్రవేశ్ మూల్యాంకనం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు.

మిరప పైరు పరిశీలన


రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

కనిగిరి రూరల్: మండలంలోని చల్లగిరిగిల్ల, నందనమారెళ్ల గ్రామాల్లో సాగులో ఉన్న మిరప పంటలను ఉద్యాన శాఖాధికారి ఎం ఆంజలీభాయి పరిశీలించారు. వర్షాలకు మిరప పంట ఉరకెత్తిన పొలాల్లో పది గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదారను నీటిలో కలిపిన ద్రావణాలను వారంలో రెండు రోజులు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు తలల వాల్చితే లీటరు నీటికి 5 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్‌తో కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకురాలు నజ్మ, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదు


పొన్నలూరులో వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై అనుక్

పొన్నలూరు: హెల్మెట్లు లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.అనుక్ అన్నారు. పొన్నలూరులో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన అనుమతి పత్రాలు, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి ఈ- చలానా ద్వారా జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు కచ్చితంగా అర్హత పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో పాటు హెల్మెట్లు లేకుండా ప్రయాణాలు చేసి ప్రమాదాల బారిన పడవద్దని వాహనదారులకు సూచించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి


విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈఓ, దాత

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థి దశలో కృషి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందని మండల విద్యాశాఖాధికారి జె.ప్రసాదరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామ్‌భూపాల్ రెడ్డి అన్నారు. స్థానిక కేజీబీవీ బాలికా విద్యాలయంలో మంగళవారం విద్యాలయం ఎస్ఓ షేక్. రేష్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2023-24 విద్యాసంవత్సరంలో కేజీబివిలో 10వ తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యాలకు దాత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి తన సొంత నిధులతో ప్రోత్సాహక బహుమతులుగా మెమొంటో, ప్రశంసాపత్రాలను ఎంఈఓ చేతులమీదుగా అందజేశారు.

నేడు ప్రజాదర్బార్

సీఎస్‌పురం(పామూరు): ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ ఖాదర్‌బీ తెలిపారు. సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు ఇవ్వవచ్చన్నారు. ప్రజాదర్బార్‌కు అన్ని శాఖల అధికారులు సమాచారంతో విధిగా హాజరుకావాలన్నారు.

ప్రత్యేక ఆధార్‌క్యాంపులు

సింగరాయకొండ: మండలంలోని ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూలగుంటపాడు, శానంపూడి, కనుమళ్ల, సోమరాజుపల్లి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి ఒక ప్రకటనలో తెలిపారు. మూలగుంటపాడులో 22 నుంచి 25 వరకు, 22, 23 తేదీల్లో శానంపూడిలో, 24వ తేదీ కనుమళ్లలో, 25 వ తేదీ సోమరాజుపల్లిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

పీసీపల్లి: మండలంలో ఈ నెల 22 నుంచి ఏర్పాటు చేయనున్న ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ అన్నారు. 22న మరుగెమ్మి సచివాలయం, 23, 24 తేదీల్లో నేరేడుపల్లి, 25న గుడేవారిపాలెం సచివాలయం పరిధిలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.